


తెలుగు జాతీయ దినపత్రిక
# అక్షర విజేత
నిజం నిర్భయం నిష్పక్షం
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక




ఆంధ్రప్రదేశ్ సంపుటి:05 సంచిక :96 ఎడిటర్ : బి. అనిల్ కుమార్ పేజీలు : 10, వెల. 6రూ/ గురువారం 29 జనవరి 2026



# రాష్ట్ర రైల్వే ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు సమీక్ష

ఆంధ్రప్రదేశ్‌లో రైల్వే ప్రాజెక్టుల పురోగతి, కొత్త మార్గాల ఏర్పాటుపై సీఎం చంద్రబాబు దృష్టి సారించారు. సచివాలయంలో దక్షిణ మధ్య, తూర్పు కోస్తా, దక్షిణ కోస్తా రైల్వే డివిజన్ల జనరల్ మేనేజర్లు, ఇతర ఉన్నతాధికారులతో ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో రైలు కనెక్టివిటీని మెరుగుపరచడం ద్వారా ఆర్థిక కార్యకలాపాలను వేగవంతం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.రాష్ట్రంలోని వివిధ పోర్టుల నుంచి తెలంగాణ, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలోని హింటర్ ల్యాండ్‌కు సరుకు రవాణాను పెంచేందుకు అవసరమైన రైలు అనుసంధానంపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు. అలాగే, రాయలసీమ ప్రాంతాల నుంచి కోస్తాంధ్రలోని వివిధ ప్రాంతాలకు కనెక్టివిటీని మెరుగుపరిచే అంశాలపైనా సమీక్షించారు.విశాఖపట్నం, విజయవాడ, గుంతకల్, గుంటూరు, రేణిగుంట వంటి ప్రధాన జంక్షన్లలో రైళ్ల రద్దీని తగ్గించే మార్గాలపై అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. విజయవాడ బైపాస్, భద్రాచలం రోడ్–కొవ్వూరు వంటి కొత్త రైల్వే లైన్ల ప్రతిపాదనల పురోగతిని కూడా సీఎం సమీక్షించారు. గిరిజన ప్రాంతాలకు రైలు సౌకర్యాన్ని విస్తరించడంపై ప్రత్యేకంగా చర్చించారు. హైదరాబాద్–చెన్నై, చెన్నై–బెంగళూరు, హైదరాబాద్–బెంగళూరు మార్గాలను హై స్పీడ్ రైల్వే కారిడార్లుగా అభివృద్ధి చేసే ప్రణాళికలపైనా ఈ సమావేశంలో చర్చించారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి రైల్వే నెట్‌వర్క్ విస్తరణ కీలకమని ఈ సందర్భంగా చంద్రబాబు అభిప్రాయపడినట్లు తెలుస్తోంది.



## వికసిత్ భారత్‌కు 2026 పునాది సంవత్సరం: రాష్ట్రపతి ముర్ము

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఈరోజు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఢిల్లీలోని పార్లమెంట్‌లో లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతో కూడిన ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ నెల 29న (గురువారం) ఆర్థిక సర్వేను, ఫిబ్రవరి 1న (ఆదివారం) కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు.ఈ సందర్భంగా రాష్ట్రపతి ముర్ము మాట్లాడుతూ.. గడిచిన ఏడాది వేగవంతమైన ప్రగతి, గొప్ప సాంస్కృతిక వారసత్వానికి గుర్తుగా నిలిచిపోయిందన్నారు. 'వికసిత్ భారత్' నిర్మాణంలో 2026వ సంవత్సరం ఒక కీలకమైన పునాది సంవత్సరంగా నిలుస్తుందని ఆమె అభివర్ణించారు. గత దశాబ్ద కాలంలో భారత్ అన్ని ప్రధాన రంగాలలో తన పునాదులను పటిష్ఠం చేసుకుందని, భవిష్యత్ వృద్ధికి బలమైన మార్గాన్ని నిర్మించుకుందని పేర్కొన్నారు.బంకించంద్ర ఛటర్జీ రచించిన 'వందేమాతరం' గీతం 150 ఏళ్లు పూర్తి చేసుకున్న వేడుకలను ఆమె గుర్తుచేశారు. శ్రీ గురు తేజ్ బహదూర్ జీ 350వ షహీదీ దివస్, బిర్సా ముండా, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవాలను ప్రస్తావించారు. దేశం తన పూర్వీకుల సేవలను గౌరవించుకున్నప్పుడు, యువతరంలో స్ఫూర్తి రగులుతుందని, అది అభివృద్ధి చెందిన భారత్ దిశగా దేశ ప్రయాణాన్ని వేగవంతం చేస్తుందని రాష్ట్రపతి తెలిపారు. కాగా, సమావేశాలకు ముందు మంగళవారం రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం జరిగింది. సభా కార్యకలాపాలు సజావుగా సాగేందుకు సహకరిస్తామని నేతలు హామీ ఇచ్చారు. ఓట్ల దొంగతనం ఆరోపణలు, ఓటర్ల జాబితా సవరణ, ధాన్యం సేకరణ, ఉపాధి హామీ పథకం వంటి ప్రజా సమస్యలపై దృష్టి సారిస్తామని కాంగ్రెస్ పార్టీ ఈ సమావేశంలో తెలిపింది

# విమాన ప్రమాదంలో మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ దుర్మరణం

**బారామతి వద్ద విమానం కూలి మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ మృతి**

**ప్రమాదంలో పైలట్లు, భద్రతా సిబ్బంది సహా మొత్తం ఐదుగురి దుర్మరణం-**

**ముంబై నుంచి బారామతి వెళ్తుండగా ల్యాండింగ్ సమయంలో ఘటన**

**స్థానిక సంస్థల ఎన్నికల సభలకు వెళ్తుండగా జరిగిన విషాదం**



మహారాష్ట్రలో ఘోర విషాదం చోటుచేసుకుంది. ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఎన్సీపీ అధినేత అజిత్ పవార్ విమాన ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. ఆయన ప్రయాణిస్తున్న చిన్న విమానం బారామతి సమీపంలో కుప్పకూలింది. ఈ ప్రమాదంలో అజిత్ పవార్‌తో పాటు పైలట్లు, భద్రతా సిబ్బంది సహా మొత్తం ఐదుగురు మరణించినట్లు అధికారులు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన నాలుగు బహిరంగ సభల్లో పాల్గొనేందుకు అజిత్ పవార్ ఈ ఉదయం ముంబై నుంచి బారామతికి బయలుదేరారు. ఉదయం 8 గంటలకు ముంబై నుంచి టేకాఫ్ తీసుకున్న విమానం, గంట తర్వాత బారామతి ఎయిర్‌పోర్టులో ల్యాండ్ అవుతుండగా ప్రమాదానికి గురైంది. విమానంలో ప్రయాణిస్తున్న ఐదుగురూ అక్కడికక్కడే మృతి చెందినట్లు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) వర్గాలు ధ్రువీకరించాయి.ప్రమాద స్థలంలో విమానం శకలాలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. మంటలు, దట్టమైన పొగలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న వెంటనే అంబులెన్సులు, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. ఈ హఠాత్పరిణామంతో మహారాష్ట్ర రాజకీయ వర్గాలు దిగ్భ్రాంతికి గురయ్యాయి.

# రెండేళ్ల చంద్రబాబు పాలన 'జంగల్ రాజ్'లా ఉంది



**మద్యం, ఇసుక మాఫియాలతో రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని ఆరోపణ**

**టీడీపీ ఎమ్మెల్యేలు మహిళలపై అరాచకాలకు పాల్పడుతున్నా చర్యలు శూన్యమని వ్యాఖ్య**

**సంక్రాంతి పండుగను జూదం, అశ్లీల నృత్యాలతో భ్రష్టు పట్టించారని విమర్శ**

**మరో ఏడాదిన్నరలో పాదయాత్ర చేపట్టి ప్రభుత్వాన్ని ఎండగడతానన్న జగన్**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని టీడీపీ కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. భీమవరం పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గడిచిన రెండేళ్ల పాలనలో రాష్ట్రంలో 'జంగల్ రాజ్' నడుస్తోందని, 'దోచుకో, పంచుకో, తినుకో' అనే రీతిలో పాలన సాగుతోందని ఘాటుగా విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీలన్నీ అబద్ధాలేనని తేలిపోయిందని అన్నారు. "చంద్రబాబు ప్రభుత్వం వచ్చి రెండేళ్లు కావస్తోంది. ఈ రెండేళ్లలో రైతులు, మహిళలు, యువత సహా ఏ ఒక్క వర్గానికైనా మంచి జరిగిందా? మా ప్రభుత్వంలో అమలు చేసిన పథకాలన్నీ రద్దు చేశారు. మేనిఫెస్టోను భగవద్గీత, బైబిల్, ఖురాన్‌గా భావించి ప్రతి హామీని నెరవేర్చిన పాలన మాది. కానీ ఇప్పుడు హామీలను మోసపూరితంగా గాలికొదిలేశారు. ఎన్నికలప్పుడు బాండ్లు పంచిపెట్టి ప్రజలను దగా చేశారు. ఇలాంటి మోసాలు చేసే వారిపై 420 కేసులు పెడతారు. కానీ చంద్రబాబు, ఆయన కూటమి నేతలు మాత్రం బయట తిరుగుతున్నారు," అని జగన్ విమర్శించారు.

రాష్ట్రంలో విచ్చలవిడి అవినీతి రాజ్యమేలుతోందని జగన్ ఆరోపించారు. "మద్యం వ్యాపారం మొత్తం మాఫియా చేతుల్లోకి వెళ్లింది. ప్రైవేట్ షాపులన్నీ వాళ్ల మనుషులకే ఇచ్చారు. గ్రామాల్లో బెల్ట్ షాపులను వేలం పెట్టి మరీ అమ్ముకుంటున్నారు. ఎంఆర్పీ కంటే ఎక్కువ ధరకు అమ్ముతూ, పర్మిట్ రూమ్‌లు నడుపుతూ, కల్తీ మద్యం అమ్ముతూ ప్రజల రక్తం తాగుతున్నారు. ఇసుక మా హయాంలో ప్రభుత్వానికి ఏటా రూ.750 కోట్లు ఆదాయం తెచ్చిపెడితే, ఇప్పుడు ఫ్రీ అని చెప్పి అక్రమంగా తవ్వేస్తూ రెట్టింపు ధరకు అమ్ముతున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు," అని జగన్ ఆరోపించారు.

సంక్రాంతి పండుగను జూదం, అశ్లీల నృత్యాలతో భ్రష్టు పట్టించారని, ఇది జంగల్ రాజ్ కాకపోతే మరేమిటని ఆయన ప్రశ్నించారు. "రోడ్లపై రికార్డింగ్ డ్యాన్సులు, మొబైల్ వ్యాన్లలో మద్యం అమ్మకాలు జరిపారు. ఈ అరాచకాల కోసం నియోజకవర్గాల్లో వేలం పాటలు నిర్వహించారు. 'ఊపేయ్, కుదిపేయ్' అంటూ యూనిఫామ్‌లో ఉన్న డీఎస్పీనే ప్రోత్సహించడం సిగ్గుచేటు," అని మండిపడ్డారు.

టీడీపీ ఎమ్మెల్యేలు, మంత్రులు మహిళలపై అరాచకాలకు పాల్పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని జగన్ ఆరోపించారు. "కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ఒక ప్రభుత్వ ఉద్యోగినిని రేప్ చేస్తే, ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ వేధింపులతో ఒక ప్రిన్సిపాల్ ఆత్మహత్యాయత్నం చేస్తే చర్యలు లేవు. సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, మంత్రి సంధ్యారాణి పీఏ, గుంటూరు ఈస్ట్ ఎమ్మెల్యే నజీర్‌లపై తీవ్ర ఆరోపణలు వచ్చినా పట్టించుకోలేదు. స్వయంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ అశ్లీల నృత్యాలు చేస్తూ చిందులేస్తున్నారు. చంద్రబాబు, ఆయన కుమారుడే వీరందరినీ ప్రోత్సహిస్తున్నారు," అని జగన్ ఆరోపించారు.ఇంకో ఏడాదిన్నరలో తన పాదయాత్ర ప్రారంభమవుతుందని, సుమారు 150కి పైగా నియోజకవర్గాల్లో పర్యటించి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతానని జగన్ ప్రకటించారు. "కళ్లు తెరిచి మూసేలోగా మూడేళ్లు గడిచిపోతాయి. నా పాదయాత్ర మొదలైతే ప్రజల్లోనే ఉంటాను. చంద్రబాబు ప్రభుత్వ అన్యాయాలను ప్రతి ఇంట్లోనూ చర్చ జరిగేలా చేయాలి. కార్యకర్తలు సంఘటితంగా ఉండి, అనుబంధ విభాగాలను బలోపేతం చేయాలి. జగన్ 2.0లో కార్యకర్తలకే ప్రథమ స్థానం ఉంటుంది," అని ఆయన భరోసా ఇచ్చారు.

# అరకు పిలుస్తోంది.. మంచు తెరల్లో 'చలి ఉత్సవం' మెరిసిపోతోంది.

## -ఘుమఘుమలాడే కాఫీ.. అదిరే సాహస క్రీడలు.. నేటి నుంచే మన్యం సంబరం

అక్షర విజేత అరకులోయ.
ఆంధ్రా ఊటీ అరకులోయలో చలి పలకరింపులు మొదలయ్యాయి. మంచు దుప్పటి కప్పుకున్న కొండ కోనల మధ్య, గిరిజన సంస్కృతిని ప్రపంచానికి చాటిచెప్పే 'అరకు చలి ఉత్సవం' నేటి నుంచి అట్టహాసంగా ప్రారంభం కానుంది. జనవరి 29 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు జరిగే ఈ వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక పండగగా నిర్వహిస్తోంది.ఇందుకోసం ప్రభుత్వం సుమారు రూ. 8 కోట్లను కేటాయించి,గతంలో ఎన్నడూ లేని విధంగా అత్యంత ఘనంగా ఏర్పాట్లు చేసింది.
ముఖ్యమంత్రి పర్యటనతో ఉత్సవ శోభ నేటి మధ్యాహ్నం 12 గంటలకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు ఈ వేడుకలను అధికారికంగా ప్రారంభిస్తారు. గిరిజన ప్రాంతాల్లోని 1/70 చట్టం పరిధిలో పర్యాటకాన్ని బలోపేతం చేసేందుకు ప్రవేశపెట్టిన సరికొత్త 'హోమ్ స్టే' పాలసీని ఆయన పరిశీలిస్తారు.అరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో పాల్గొని ఉత్సవాల సందడిని ప్రారంభిస్తారు.ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణలు ఇవే.గాలిలో తేలిపోదాం (సాహస క్రీడలు) సాహస ప్రియుల కోసం పర్యాటక శాఖ వినూత్న కార్యక్రమాలను రూపొందించింది. హెలికాప్టర్ రైడ్ చాపరాయి నుంచి అరకు అందాలను ఆకాశం నుంచి వీక్షించవచ్చు.
హాట్ ఎయిర్ బెలూన్ పద్మాపురం గార్డెన్స్ వద్ద గాలిలో విహరించే అవకాశం. పారా గ్లైడింగ్ మాడగడ సన్‌రైజ్ పాయింట్ వద్ద పారా మోటరింగ్ సందడి.అరకు కాఫీ అలాగే గిరిజన రుచులు చలికాలంలో అరకు వెళ్తే అరకు కాఫీ తాగకుండా తిరిగి రాలేం. ప్రపంచ ప్రసిద్ధి గాంచిన తాజా ఆర్గానిక్ కాఫీ ఘుమఘుమలతో పాటు,గిరిజన వంటకాలు, చిరుధాన్యాల (మిల్లెట్స్) ఆహార ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది.క్రీడలు,ప్రకృతి పర్యటన జనవరి 30 తేదీన గాలికొండ వ్యూ పాయింట్ వద్ద పర్యాటకులు,స్థానికులతో కలిసి భారీ ట్రెక్కింగ్,జనవరి 31 అరకు మారథాన్ మరియు సైక్లింగ్ పోటీలు,ఫ్లవర్ షో పద్మాపురం ఉద్యానవనంలో కనువిందు చేసే పుష్ప ప్రదర్శన. సంగీత,సాంస్కృతిక జాతర వివిధ రాష్ట్రాల గిరిజన కళాకారుల సంప్రదాయ నృత్యాల కార్నివాల్.జనవరి 31: ప్రముఖ మెలోడీ క్వీన్ సునీత లైవ్ మ్యూజిక్ షో.ఫిబ్రవరి 1: గిరిజన ఫ్యాషన్ షో, అద్భుతమైన డ్రోన్ షో మరియు సంగీత దర్శకుడు థమన్ బృందంతో ముగింపు వేడుకలు.కలెక్టర్ ఎస్.దినేష్ కుమార్,ఐటీడీఏ పీవో తిరుమణి శ్రీపూజ నిరంతరం పర్యవేక్షిస్తూ పర్యాటకుల భద్రత కోసం ఎస్పీ అమిత్ బర్దర్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మౌలిక సదుపాయాల్లో ఎలాంటి లోటు లేకుండా చర్యలు తీసుకున్నారు.మంచు కురిసే కొండలు,




ఘుమఘుమలాడే కాఫీ, అదిరే సాహస క్రీడలు వెరసి అరకు ఉత్సవం ఒక మధుర జ్ఞాపకం. ఇంకెందుకు ఆలస్యం ఈ వారాంతంలో అరకులోయ ఇచ్చే ఈ మరుపురాని అనుభూతిని సొంతం చేసుకోండి!




## సమర్థవంతమైన సేవలతో నే గుర్తింపు

### పెంటపాడు ఎంపీపీ వెంకటలక్ష్మి

తాడేపల్లిగూడెం, (అక్షర విజేత) పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో:
సమర్ధవశీతమైన సేవలు అందించినపుడే ఉద్యోగులు ప్రజలు మన్ననలు పొందుతారని తాడేపల్లిగూడెం నియోజకవర్గం పెంటపాడు మండల ఎంపీపీ కట్టుబోయిన వెంకటలక్ష్మి పేర్కొన్నారు. ఉత్తమ అధికారిగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి చేతుల మీదుగా అందుకున్న మండలంలోని కే పెంటపాడు వేణుగోపాల స్వామి దేవస్థానం ఫిట్ పర్సన్, తాడేపల్లిగూడెం బ లుసులమ్మ తల్లి ఆలయ కార్య నిర్వహణ అధికారి కె చంద్రశేఖర్ ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పెంటపాడు మండల పరిషత్ కార్యలయం లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీపీ పాల్గొన్నారు. ఉద్యోగులు సేవలు ద్వారానే ప్రభుత్వం కి మంచిపేరు వస్తుందన్నారు. మండలం లో ప్రతీ ఉద్యోగి బాధ్యత గా పని చేసి మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. జిల్లా లో పెంటపాడు మండలం అన్ని శాఖల లో ప్రధమ స్థానం సాదించాలన్నారు జిల్లా ఉత్తమ ఉద్యోగి పురస్కారం అందుకున్న చంద్రశేఖర్ ని అభినందించారు. మండలాన్ని ప్రగతి పదంలో నడపడానికి కృషి చేస్తున్నాట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాంప్రసాద్ ఎం ఈ ఓ లు ఎం శ్రీనివాస్ , టివి రామకృష్ణ పోస్ట్ బేసిక్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేష్, జనసేన నాయకులు కట్టుబోయిన కృష్ణ ప్రసాద్, బి జే పీ నాయకులు కుదుళ్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

## అధికారుల సేవలకు గుర్తింపు






తాడేపల్లిగూడెం, (అక్షర విజేత) పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో: రెవిన్యూ శాఖలో వివిధ విభాగాలలో విశేష ప్రతిభ కనబరిచిన అధికారులు ప్రభుత్వ ప్రశంసలు అందుకున్నారు. వీరికి భీమవరం కలెక్టరేట్లో నిర్వహించిన 77వ గణతంత్ర వేడుకలలో కలెక్టర్ చదలవాడ నాగరాణి తాడేపల్లిగూడెం ఎంఆర్ఓ కార్యాలయ సూపరింటెండెంట్ కాళీ కృష్ణ, ఆర్డిఓ కార్యాలయ డిప్యూటీ తాసిల్దార్ పోతురాజు, ప్రశంస పత్రాలు అందజేశారు. ప్రశంస పత్రాలు అందుకున్న వారిని ఆర్డిఓ ఖతీబ్ కౌసర్ భానో, తహశీల్దార్ సునీల్ కుమార్ కార్యాలయ సిబ్బంది అభినందించారు.

## మోచర్ల సచివాలయాన్ని సందర్శించిన జడ్పీ సీఈవో చిరంజీవి

గుడ్లూరు, : మండలంలోని మోచర్ల సచివాలయాన్ని జెడ్పి సీఈవో చిరంజీవి బుధవారం సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో జరుగుతున్న సర్వేను ఆయన పరిశీలించారు. సర్వే చేపడుతున్న తీరును ఆయన పరిశీలించి సర్వేలను వేగవంతం చేయాలని చెప్పారు. పంచాయతీ కార్యదర్శి మార్టిన్, వెల్ఫేర్ అసిస్టెంట్ సునీల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ శ్రావణి తదితరులు చేస్తున్న సోదరులకు పరిశీలించారు అనంతరం సచివాలయాన్ని పరిశీలించి ఎంతమంది సిబ్బంది హాజరయ్యారు సర్వే ఎంత మంది చేస్తున్నారు పంచాయతీ కార్యదర్శులు అడిగి తెలుసుకున్నారు సచివాలయ ఉద్యోగుల అటెండెన్స్ రిజిస్టర్,మూమెంట్ రిజిస్టర్ లను ఆయన పరిశీలించారు.






## వైఎస్సార్సీపీ బలోపేతం కు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అంటున్న వైయస్సార్సీపి మంత్రాలయం మండల అధ్యక్షులు జి .భీమ రెడ్డి

అక్షర విజేత మంత్రాలయం:
వైఎస్సార్సీపీ బలోపేతం కు గ్రామ స్థాయి లో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైఎస్సార్సీపీ మండలాధ్యక్షులు జి. భీమిరెడ్డి. అన్నారు. బుధవారం మండల పరిధిలోని చెట్నేహళ్లి గ్రామంలో ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి. రాంపురం రెడ్డి సోదరుల ఆదేశాల మేరకు గ్రామ కమిటీ ల నియామకం చేపట్టారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం కైవసం చేసుకోవాలని సూచించారు. 2029లో వై. ఎస్. జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయితే మన నియోజకవర్గం తరుపున ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి ని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటే మంత్రి అయ్యే అవకాశం ఉందని అందరూ సమిష్టి కృషి తో పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అనుబంధ విభాగాల నాయకులు, వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, రాంపురం రెడ్డి సోదరుల అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## రామసముద్రంలో ఘనంగా బ్రహ్మ రథోత్సవాలు

### - పాండురంగ స్వామి అవతారంలో దర్శనమిచ్చిన లక్ష్మీ జనార్ధన స్వామి

రామసముద్రం అక్షర విజేత మండల కేంద్రంలో వెలసిన శ్రీ లక్ష్మీ జనార్ధన స్వామి బ్రహ్మ రథోత్సవాలలో భాగంగా బుధవారం స్వామివారు శ్రీ పాండురంగ స్వామి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయ ప్రధాన అర్చకులు పార్థసారథి బట్టర్, కులశేఖర్ బట్టర్ స్వామివారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు, కుంకుమార్చనలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. అనంతరం అర్చకులు భక్తులకు తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు. బ్రహ్మ రథోత్సవాలు భక్తి శ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

## మునిసిపల్ ఫ్లోర్ లీడర్ గంగా శ్రీనివాసరావును పరామర్శించిన మున్సిపల్ ఛైర్మన్, కౌన్సిలర్లు..

చిలకలూరిపేట అక్షర విజేత
టీడీపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గంగా శ్రీనివాసరావు ఇటీవల మో చేతికి శస్త్రచికిత్స చేయించుకుని కోలుకుంటున్న నేపథ్యంలో, పలువురు ప్రజాప్రతినిధులు ఆయనను మర్యాదపూర్వకంగా పరామర్శించారు.మున్సిపల్ ఛైర్మన్ రఫాని బుధవారం శ్రీనివాసరావు నివాసానికి చేరుకుని, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. శస్త్రచికిత్స తర్వాత జాగ్రత్తల గురించి వివరాలు తెలుసుకుంటూ, త్వరగా పూర్తి ఆరోగ్యంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు.శ్రీనివాసరావును పరామర్శించిన వారిలో మున్సిపల్ ఛైర్మన్‌తో పాటు కౌన్సిలర్లు బేరింగ్ మౌలాలి, హరిత, చెమిటిగంటి పార్వతి, సుజాత, కరుణలు, మాజీ కౌన్సిలర్ అబ్దుల్ రవుఫ్ ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ కార్యక్రమాల్లోనూ, మున్సిపల్ వ్యవహారాల్లోనూ చురుగ్గా ఉండే శ్రీనివాసరావు త్వరలోనే కోలుకుని మళ్లీ ప్రజాసేవలో నిమగ్నం కావాలని కోరుకుంటున్నామని తెలిపారు.

## ఒకరోజు ముందుగానే (ఈ నెల 31న) పెన్షన్ ల పంపిణీ.

### -ఎం పి డి ఓ సీతామహాలక్ష్మీ.



అక్షర విజేత,చింతపల్లి
ఫిబ్రవరి ఒకటో తేదీ ఆదివారం రావడంతో పెన్షన్ లబ్ధిదారులకు ఒకరోజు ముందుగానే ఈ నెల 31 న పెన్షన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి సి.హెచ్ సీతా మహాలక్ష్మీ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆమె మాట్లాడుతూ ఫిబ్రవరి 1 వ తేదీ ఆదివారం కావడంతో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలం లో ఈ నెల 31 (శనివారం)నే పెన్షన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు.ఈ నేపద్యంలో పెన్షన్ లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆమె కోరారు.

## ఎమ్మిగనూరు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మిగనూరు జమియా మసీద్ ప్రెసిడెంట్ షబ్బీర్ టిడిపి పట్టణ మైనార్టీ నాయకులు హుస్సేన్ పీరా ముస్లిం ఖబరస్తాన్ లో సౌకర్యాలు కల్పించాలి



అక్షర విజేత ఎమ్మిగనూరు:
స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి. ఆదేశాల మేరకు ముస్లిం సోదరులు జరుపుకునే షబే - బరాత్ (పెద్ద రాత్రి) సందర్బంగా ఎమ్మిగనూరు ఖబరస్తాన్ కు ఎక్కువ సంఖ్యలో వచ్చే ముస్లిం సోదరులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలని ఎమ్మిగనూరు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డికు ఎమ్మిగనూరు జామియా మసీదు ప్రెసిడెంట్ షాబీర్, టిడిపి పట్టణ మైనార్టీ నాయకులు హుస్సేన్ పీరా, తురేగల్ నజీర్ ఆహమ్మద్ లు విన్నవించారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో వారు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫిబ్రవరి 3వ తేదీ జరుపుకునే ఈ పండుగను ముస్లిం సోదరులు పట్టణంలోని అన్ని మసీదులకు సంబంధించిన వారు నమాజ్ అనంతరం ఖబరస్తాన్ కు రాత్రి 10 గంటల నుండి ఉదయం 5 గంటల వరకు వస్తుంటారని, అక్కడ విద్యుత్ సౌకర్యాలతో పాటు తాగునీటి వసతి, బందోబస్తు నిర్వహించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మైనార్టీ నాయకులు సలీం, గట్టు రఫీక్, అల్లవుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## శైవ క్షేత్రాల్లో మంత్రాలయం ఎమ్మెల్యే వై బాలనాగి రెడ్డి పూజలు



అక్షర విజేత మంత్రాలయం:
శైవ క్షేత్రాలైన కాల్వ బుగ్గ, మహనంది క్షేత్రాల్లో మంత్రాలయం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి , కాచాపురం సర్పంచ్ వై. జయమ్మ . స్వామి వార్లకు పంచామృతాభిషేకం నిర్వహించి ప్రత్యేక హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం దేవాదాయశాఖ అధికారులు వారికి తీర్థ ప్రసాదాలను అందజేసి ఆశీర్వాదించారు

# నకిలీ సంతకాలు చేసిన వారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలి

**అనుమతులు లేకుండానే హెల్త్ వెల్నెస్ సెంటర్ నిర్మాణం-గుంటూరు జిల్లా అధికారులకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఫిర్యాదు**

మంగళగిరి–అక్షరవిజేత

జనవరి 28 మంగళగిరి, దీక్ష గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం చిలువూరు గ్రామ పరిధిలోని మాదిగపల్లెలో చేపట్టిన హెల్త్ వెల్నెస్ సెంటర్ (ఆరోగ్య కేంద్రం) నిర్మాణం వివాదాస్పదంగా మారింది. నిర్దిష్ట పంచాయితీ తీర్మానం, స్థలానికి సంబంధించిన సరైన ధృవపత్రాలు, అలాగే మెజారిటీ గ్రామ ప్రజల సమ్మతి లేకుండానే నిర్మాణాన్ని ప్రారంభించారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల జరిగిన శంకుస్థాపన కార్యక్రమంలో స్థానిక ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొనడం పలు అనుమానాలకు తావిస్తోంది. నిబంధనలను పక్కనపెట్టి నిర్మాణాన్ని ప్రారంభించడంతో పాటు, సంబంధిత అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంలో గ్రామ సర్పంచ్, ఎంపీటీసీతో పాటు వారి అనుయాయులు రాజ్యాంగేతర శక్తుల్లా వ్యవహరిస్తూ ప్రజల మధ్య వర్గ వైషమ్యాలు సృష్టిస్తున్నారని స్థానికులుఆరోపిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి,సర్పంచ్ కుమారుడు, ఎంపీటీసీ భర్త పాత్రపై కూడా విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, సదరు హెల్త్ వెల్నెస్ సెంటర్ నిర్మాణాన్ని తక్షణమే నిలిపివేయాలని, పంచాయితీ తీర్మానం, స్థల సేకరణ పత్రాలు, ప్రజల సమ్మతి వంటి అంశాలపై సమగ్ర విచారణ నిర్వహించాలని జిల్లా పంచాయితీ అధికారి, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఇన్చార్జి లకు ఫిర్యాదు చేసినట్లు ఎమ్మార్పీఎస్ నాయకులు బుధవారం



ప్రకటనలో తెలిపారు. అవినీతి అక్రమాలకు పాల్పడిన అధికారులుప్రజా ప్రతినిధులు, వారి అనుయాయులపై శాఖాపరమైన, చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. విచారణ ఫలితాలపై ఆధారపడి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# విశాఖ జిల్లా ప్రోగ్రామ్స్ కో ఆర్డినేటర్ గా చరణ్ నియామకం



అక్షర విజేత విశాఖ బ్యూరో:: రాష్ట్రంలో గల ప్రఖ్యాత కాప్స్ రాక్స్ సంస్థ తరుపున విశాఖ పశ్చిమం నుండి 89 వ వార్డు కొత్తపాలెం వాస్తవ్యుడు యువకుడు వాక్ పటిమ గల కిమిడి చరణ్ కమల్ ను ప్రత్యేకంగా ఎంపిక చేసి విశాఖ జిల్లా ప్రోగ్రామ్స్ కో ఆర్డినేటర్ గా నియమిస్తూ పౌండర్ వ్యవస్థాపకుడు పెద్దిరెడ్డి శివ భాస్కర్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు, సంస్థ లక్ష్యాలు,కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత సమర్ధవంతంగా తీసుకెల్లడంలో చరణ్ సేవలు ఎంతొ విలువైనవిగా బావించి ఈ బాద్యుతాయుతమైన పదవికి ఆయనను ఎంపిక చేసామని అలాగె ఈ బాద్యతలను సమర్దవంతంగా నిర్వహించి,మన సంస్థ నుండి మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని శివ భాస్కర్ ఆశించారు,ఈ సందర్భంగా చరణ్ మాట్లాడుతూ సంస్థ వ్యవస్థాపకులు శివ భాస్కర్ ఆదేశాలను తుచ తప్పకుండా పాటిస్తూ మన సంస్థ అభివృద్ధికి నా సాయశక్తుల క్రృషి చేస్తానని,నాపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన శివ భాస్కర్ గారికి క్రృతజ్ఞతలు తెలియజేస్తున్నాను అన్నారు.

# నెల్లూరు పార్లమెంట్ వర్క్ షాప్‌కు హాజరైన మామిళ్లపల్లి ఓంకార్

కావలి

తెలుగుదేశం పార్టీ కార్యాలయం, మంగళగిరిలో నిర్వహించిన నెల్లూరు పార్లమెంటరీ వర్క్ షాప్‌కు ఉదయగిరి నియోజకవర్గం కొండాపురం మండలానికి చెందిన బుల్లెట్ పార్లమెంట్ టిడిపి ఉపాధ్యక్షులు మామిళ్ళపల్లి ఓంకార్ హాజరుకావడం జరిగింది. ఇటీవల నూతనగంగా ఎన్నికైన నెల్లూరు జిల్లా పార్లమెంట్ కమిటీ సభ్యులతో పాటు రాష్ట్రంలో నూతనంగా ఎన్నికైన అన్ని పార్లమెంటరీ పార్టీ సభ్యులకు కూడా ఈ వర్క్ షాప్ లో పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా తెలుగుదేశం జాతీయ పార్టీ అధ్యక్షులు ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు యువ నాయకులు నారా లోకేష్ బాబు ,పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ హాజరై, ఇటీవల ఎన్నికైన నాయకులకు వారి బాధ్యతలు, పార్టీకి పనిచేయవలసిన క్రమశిక్షణ, అలాగే సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి పార్టీ విధానాలను ఎలా తీసుకెళ్లాలి అనే అంశాలపై స్పష్టమైన మార్గనిర్దేశం చేశారు. ఈ వర్క్ షాప్ ప్రతి కార్యకర్తలో కొత్త ఉత్సాహాన్ని నింపిన అత్యంత ప్రేరణాత్మక కార్యక్రమం. తెలుగుదేశం పార్టీ రాబోయే 15 సంవత్సరాలు అధికారంలో ఉండేలా పార్టీ బలోపేతానికి అన్ని విధాలా కృషి చేస్తామని, పార్టీ అధిష్టానం ఇచ్చే ప్రతి ఆదేశాన్ని శిరసావహించి అమలు చేస్తామని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాము చంద్రబాబు నాయుడు , లోకేష్ బాబు ఇచ్చిన సూచనలు, సలహాల ఆధారంగా పార్టీ లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నిరంతరం శ్రమిస్తాము. ఈ సందర్భంగా వివిధ నియోజకవర్గాల ఎమ్మెల్యేలను కలుసుకుని ముచ్చటించడం జరిగింది. అలాగే వర్క్ షాప్ అనంతరం, ఈరోజు నెల్లూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి తట్టవర్తి రమేష్ తో కలిసి విజయవాడ శ్రీ కనకదుర్గ అమ్మవారి దర్శనం చేసుకుని, పార్టీ విజయాలు, రాష్ట్ర అభివృద్ధి కోసం అమ్మవారి ఆశీస్సులు కోరుకోవడం జరిగింది



# ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ

**-అమలుకు అభ్యంతరం లేదన్న కేంద్ర ప్రభుత్వం-కేంద్ర ప్రభుత్వం ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను ఎందుకు అమలు చేయదు?**

**-ఎమ్మార్పీఎస్ ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ లీగల్ సెల్ కన్వీనర్ చిలువూరు నాగరాజు మాదిగ సుప్రీమ్ కోర్టుకు లేఖాస్త్రం**

మంగళగిరి–అక్షరవిజేత

8 దశాబ్దాల గణతంత్ర భారత దేశంలో కేంద్ర ప్రభుత్వం, కేంద్రం విద్యా ఉద్యోగ రంగాల్లో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను అమలు చేయకుండా రాష్ట్రాలు కేంద్రపాలిత ప్రాంతాలు అమలు చేసుకొనుటకు అభ్యంతరం లేదని సుప్రీమ్ కోర్టుకు అఫిడవిడ్ సమర్పించడం ఎస్సీ రిజర్వేషన్ల ఆశయ సాధనకు భారత దేశ సమాఖ్య భావనకు , ప్రజాస్వామ్య పిపాసకు, అంబేద్కర్ రాజ్యాంగ స్ఫూర్తికి, సమానత్వ సూత్రానికి ఎస్సీ ప్రజల జీవించే హక్కుకు తీవ్ర విఘాతం కలిగిస్తుందని ఉసురుపాటి బ్రహ్మయ్యా మాదిగ నేతృత్వంలోని ఎమ్మార్పీఎస్ ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ లీగల్ సెల్ కన్వీనర్ న్యాయవాది చిలువూరు నాగరాజు మాదిగ ఆదివారం చిలువూరు లో జరిగిన మీడియా సమావేశంలో స్పష్టం చేశారు. దేశ వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టే భారీ విద్యాప్రవేశాలు ఉద్యోగ నియామకాల్లో ఎస్సీ రిజర్వేషన్ల అమలు చేయకుండా రిజర్వేషన్ల ఆశయ సాధన, ఎస్సీలకులకు సామాజిక న్యాయం అందించడం సమానత్వాన్ని సాధించడం ఎలా సాధ్యం అవుతుందని నాగరాజు మాదిగ ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ రిజర్వేషన్ల అమలు పట్ల కేంద్ర ప్రభుత్వం కేంద్రం చిత్తశుద్ధి లేని వైఖరిని బహిర్గతం చేస్తున్నదని నాగరాజు మాదిగ స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో 2024 లో సుప్రీమ్ కోర్టు రాజ్యాంగ ధర్మాసనం రాజ్యాంగ సమీక్ష న్యాయ సమీక్ష ద్వారా దేశంలోని అన్ని రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు రిజర్వేషన్ల వర్గీకరణ అమలుకు అనుకూలంగా చారిత్రక , సంచలన తీర్పు ఇచ్చిన భారత సుప్రీమ్ కోర్టు రాజ్యాంగ ధర్మాసనం కేంద్రం కేంద్ర ప్రభుత్వంలో విద్యా ఉద్యోగ రంగాల్లో ఎస్సీవర్గీకరణ అమలు ప్రస్తావించక పోవడం గర్హనీయం. కేంద్రం కేంద్ర ప్రభుత్వ హయాంలో విద్యా ,ఉద్యోగ రంగాల్లో ఎస్ సి రిజర్వేషన్ల వర్గీకరణ అమలు చేయకుండా ఈ విధంగా ఎస్సీ ల్లోనీ అన్ని సామాజిక వర్గాలకు సామాజిక న్యాయం అందించడం సాధ్యం అవుతుందో కేంద్రం కేంద్ర ప్రభుత్వం ఆస్థానం చెప్పాల్సిన ఆవశ్యకత ఉన్నది. కేవలం రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఎస్సీ వర్గీకరణ అమలుకు మార్గం సుగమం చేసిన సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనం కేంద్రం కేంద్ర ప్రభుత్వం లో చేపట్టే విద్యా , ఉద్యోగ రంగాల్లో ఎస్సీ రిజర్వేషన్ల అమలు గురించి ప్రస్తావించక పోవడం గర్హనీయం బాధాకరం. ఈ క్రమంలో భారత దేశ సమాఖ్య వ్యవస్థలో కేంద్రం ప్రభుత్వంలో కూడా ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమలు అయితేనే సామాజిక న్యాయం స్ లోని అన్ని ఉపకులలకు అందుతుందని తద్వారా ఎస్సీ ల్లో సమానత్వం సాధ్యం అవుతుంది



కాబట్టి కేంద్ర ప్రభుత్వం చేపట్టే అన్ని విద్యా ప్రవేశాల్లో, ఉద్యోగ నియామకాల్లో కూడా ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమలు చేయుటకు రాజ్యాంగ సమీక్ష న్యాయ సమీక్ష చేయాలని సుప్రీం కోర్టుకు లేఖాస్త్రం అందిస్తున్నట్టు చిలువూరు నాగరాజు మాదిగ పేర్కొన్నారు.

# గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతం చేస్తా

**వైఎస్ఆర్సిపి ఇంచార్జ్ రఘు రామ్ నాయుడు**

తాడేపల్లిగూడెం, (అక్షర విజేత) పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో: నియోజకవర్గంలో గ్రామస్థాయి నుంచి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తాడేపల్లిగూడెం నియోజకవర్గం పార్టీ ఇంచార్జి వడ్డీ రఘురామ్ నాయుడు పేర్కొన్నారు. స్థానిక మాగంటి ఫంక్షన్ హాల్ లో బుధవారం ఏర్పాటు చేసిన నియోజకవర్గం పార్టీ నాయకుల కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. పార్టీలోని ప్రతి కార్యకర్త నియోజకవర్గ ఇంచార్జ్ అని అన్నారు. నేటి ఆత్మీయ సమావేశం కూటమి నాయకుల గుండెల్లో గుబులు రేపుతుంద న్నారు. పార్టీలో వర్గాలు లేవన్నారు. రాబోయే ఎన్నికలలో నియోజవర్గంలో పార్టీ జెండా ఎగరేస్తామని ధీమా వ్యక్తం చేశారు. మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ సలహాలు సూచనలు తీసుకుని నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేస్తామన్నారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు నిర్వహించిన ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేయడం తధ్యమన్నారు. తొలుత వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

జిల్లా అధ్యక్షులు ముదునూరి ప్రసాద్ రాజు మాట్లాడుతూ రెండేళ్ల నుంచి పార్టీలో పూర్తి ప్రక్షాళన జరుగుతోందన్నారు. ఆనాడు వైయస్ రాజశేఖర్ రెడ్డి కి జరిగిన అన్యాయానికి అన్నగా వైఎస్ జగన్మోహన్ రెడ్డికి వెంట ఉన్నామని అన్నారు. అధికారం ఉన్న లేకపోయినా జగన్మోహన్ రెడ్డి ఎల్లప్పుడూ ప్రజల పక్షాన పోరాడుతున్నారని గుర్తు చేశారు. పార్టీ కోసం ఎంతోకాలంగా కష్టపడుతున్న ప్రతి ఒక్కరిని వైఎస్ జగన్మోహన్ రెడ్డి గుర్తిస్తున్నారని అదేవిధంగా వాళ్ళని ముందుకు తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నారని చెప్పారు. గత ఐదేళ్లలో ఎన్నడూ లేనివిధంగా పరిపాలన చేసి ప్రజల గుండెల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒక చెరగనిముద్ర వేసుకుంది అని గుర్తు చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం ప్రతీ కార్యకర్త కష్టపడలని పార్టీ వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.



నరసాపురం పార్లమెంటరీ పరిశీలకులు ముదునూరి మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అనేక అబద్ధాలు చెప్పి, మోసాలు చేసి అధికారంలోకి వచ్చిందని న్నారు. గత ఇంచార్జ్ కొట్టు సత్యనారాయణ ఆధ్వర్యంలో ఇప్పటివరకు పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని విజయవంతం చేశారని అలాగే ఇకనుండి వడ్డీ రఘురాం నాయుడు కి సపోర్ట్ చేస్తూ పార్టీని మరింతగా బలోపేతం చేయాలని పార్టీ శ్రేణులను కోరారు. మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు మాట్లాడుతూ రైల్వే కోడూరు జనసేన ఎమ్మెల్యే శ్రీధర్ ఒక ఒంటరి మహిళపై లైంగిక వేధింపులకు పాల్పడడం అత్యంత దారుణమన్నారు. ప్రజా ప్రతినిధులు దగ్గరే రక్షణ లేకపోవడం అవమానకరమన్నారు. తిరుపతి లడ్డూలో ఆవు కొవ్వు,



పందికొవ్వు, చేప కొవ్వులను కలిపారంటూ చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ఈ వ్యవహారంలో సుప్రీంకోర్టు సైతం మొట్టికాయలు వేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఎంతో దారుణమైన అబద్దాలు ఆడి ఆఖరికి ఆ భగవంతుడుని కూడా అవమానించారన్నారు. మోస పూరిత హామీలు చేసి ప్రజలని మోసం చేశారన్నారు. దీనికి చంద్రబాబు, పవన్ ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. మాజీ హోం మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ వైసీపీ మాజీ ప్రజాప్రతినిధులు, సోషల్ మీడియా కార్యకర్తలపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు నమోదు చేస్తుందన్నారు. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని వైసీపీ నాయకులపై కక్ష సాధింపులకు వినియోగిస్తున్నారని విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాలను నెరవేర్చకుండా నెరవేర్చినట్లు సక్సెస్ మీట్ లు పెట్టడం విడ్డూరమన్నారు.

మాజీ మంత్రి చెరుకువాడ శ్రీ రంగనాథ రాజు మాట్లాడుతూ కూటమి పాలన రెండేళ్లు పూర్తి కాకుండానే వారికి రాబోయే ఎన్నికల్లో ఓడిపోతామనే భయం వెంటాడుతుందన్నారు. వైఎస్ఆర్సీపి కి మంచి క్యాడర్ ఉంది, శ్రేణులు ప్రజలతో మమేకమై ఉండాలనీ చెప్పారు. కేడర్ ను పట్టించుకోకపోవడం వల్ల మా వాడు ఓడిపోతాడనే మాట వచ్చిందని వ్యాఖ్యానించారు. నాడు జగన్ పాలనలోనూ నేటి కూటమి పాలనలోనూ కేడర్ నుంచి వినిపిస్తున్న మాట ఇదే అని తెలిపారు. రాజకీయాల్లో



ఒకరినొకరు దూషించుకునే పరిస్థితి వచ్చిందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ ఎన్నికల్లో ఓటమి చెందిన కూడా మన కార్యకర్తలో ఎక్కడా కూడా అధైర్యం లేదన్నారు. మన నాయకుడు జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన మాట తప్పకుండా సంక్షేమ పరిపాలన అందించారు కాబట్టే ప్రతీ కార్యకర్త నిరంతరం ప్రజల్లో ధైర్యంగా తిరుగుతున్నార న్నారు. ఈ రోజు ఈ ఆత్మీయ సమావేశానికి వేల సంఖ్యలో కార్యకర్తలు హాజరు అవుతున్నారు అంటే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంత పటిష్టంగా ఉందో తెలుస్తోందన్నారు. గ్రామ సచివలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్ అంటూ గ్రామలో ఎన్నో సేవలను అందుబాటులోకి తీసుకొచ్చిన ఘనత వైసీపీకి దక్కుతుం దన్నారు. ఎన్నో దొంగ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన ఈ కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తయిన ఇంతవరకు ఏం హామీలు నెరవేర్చారో సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉన్న అన్ని వర్గాల ప్రజలు కూడా అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని గుర్తు చేశారు. సమావేశంలో ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్, మాజీ ఎమ్మెల్యే ఉప్పల్ ఏసుబాబు, మాజీ ఎంపీ చింత అనురాధ పాల్గొన్నారు. భారీ సంఖ్యలో కార్యకర్తలు నాయకులు హాజరయ్యారు

# 'యువగళం' లోకేశ్ జీవితంలో.. రాష్ట్ర రాజకీయాల్లో కీలక మలుపు : ప్రత్తిపాటి

**- లోకేశ్ మన నాయకుడు.. మనకు న్యాయంచేస్తాడనే నమ్మకాన్ని ప్రజలకు కలిగించింది : ప్రత్తిపాటి.**

**- నాటి యాత్రలో ఆయనతో సాగించిన ప్రయాణం ఎప్పటికీ నాకొక మధుర జ్ఞాపకం : ప్రత్తిపాటి**

**- లోకేశ్ తో నాకున్న అనుబంధం ఆ సమయంలో మరింత బలపడింది: ప్రత్తిపాటి**

చిలకలూరిపేట అక్షర విజేత

" 2023 జనవరి 27న కుప్పంలో మొందలైన యువగళం పాదయాత్ర, నారాలోకేశ్ ను ప్రజల హృదయాల్లో బలమైనా నాయకుడిగా ప్రతిష్టింపచేసింది. ఆయన పట్టుదల, సంకల్పాన్ని ప్రజలకు పరిచయం చేసింది. ఆ పాదయాత్ర లోకేశ్ జీవితానికి, రాష్ట్ర రాజకీయాయలకు కీలక మలుపుగా నిలిచింది. ప్రజా చైతన్యంతో పాటు, పతనమైన రాష్ట్ర భవిష్యత్తు పున:నిర్మాణమే తన లక్ష్యంగా లోకేశ్ నాడు ప్రారంభించిన యువగళం పాదయాత్ర, అతి తక్కువ కాలంలోనే అన్నివర్గాల ప్రజలకు చేరువైంది. రైతుల బాధలు.. నిరుద్యోగులు సమస్యలు. మహిళల కష్టాల పరిష్కారం దిశగా నాడు లోకేశ్ వేసిన అడుగులు నేడు కేవలం 18 నెలల్లోనే కార్యరూపం దాల్చాయి.

**యువగళం పాదయాత్ర కాదు..కొన్ని తరాల ఆశలు, ఆశయాలకు లోకేశ్ ఇచ్చిన బలమైన హామీ**

యువగళం కేవలం పాదయాత్ర కాదు.. భావి నాయకుడు లోకేశ్ కొన్ని తరాల ఆశలు, ఆశయాలకు ఇచ్చిన బలమైన హామీ. సాఫ్ట్ లీడర్ నుంచి మాస్ లీడర్ గా లోకేశ్ ఎదిగిన తీరు... ఎందరో దేశ



యువ రాజకీయనాయకులకు ప్రేరణగా, స్ఫూర్తిగా నిలిచింది. యువగళం యాత్రతో.. ఇతను మన నాయకుడు. మన మాట వింటాడు.. మనకు న్యాయం చేస్తాడనే నమ్మకం ప్రజల్లో కలిగించడంలో లోకేశ్ విజయం సాధించారు. యువగళంతో అటు పార్టీ కార్యకర్తలతో పాటు.. 5 కోట్ల ప్రజల అభిమానాన్ని, విశ్వాసాన్ని, అంతులేని నమ్మకాన్ని లోకేశ్ చూరగొన్నారు. నమ్మకమైన ప్రజానాయకుడిగా జనహృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించారు. ఏపీని ప్రపంచ పెట్టుబడుల గమ్యస్థానంగా మార్చడంలో లోకేశ్ తనకు తానే సాటిగా నిలిచాడు. తాత పట్టుదల. తండ్రి మార్గదర్శకత్వం.. ఆలోచనా ధృక్పథంతో పెట్టుబడిదారుల్ని ఆకట్టుకోవడంలో లోకేశ్ పాదరసం కంటే చురుగ్గా వ్యవహరిస్తున్నారు. ప్రపంచ ప్రతిష్టాత్మక కంపెనీలు..సంస్థల్ని ఏపీ వైపు మళ్లించడంలో నిష్ణాతులైన, తలపండిన రాజకీయ నాయకులకే ఆయన దిక్సూచిగా నిలుస్తున్నారు.

**లోకేశ్ తో సాగించిన ప్రయాణంలో ఆయనతో నా అనుబంధం మరింత బలపడింది : ప్రత్తిపాటి**

యువగళం యాత్రలో లోకేశ్ తో కలిసి నడిచిని నాటి మధుర క్షణాలు నాకు ఎప్పటికీ గుర్తుంటాయి. ఆయనతో నాకున్న అనుబంధం ఆ సమయంలో మరింత బలపడింది. వయసులో చిన్నవాడైనా..ఆలోచనల్లో.. రాజకీయ పరిశీలన.. విశ్లేషణలో ఆయన ఎంతో మెరుగ్గా ఉండేవారు. ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, చాలా లోతుగా, భవిష్యత్ పరిస్థితులు కు తగినట్టుగా ఆలోచించేవారు. యువగళం యాత్ర అద్దంకిలోకి వచ్చాక లోకేశ్ తో పాదం కలిపాను. విశాఖపట్నం చేరేవరకు యువనేతతో ముందుకు సాగాను." అని పత్రిపాటి మంగళవారం ఒక ప్రకటనలో నాటి అనుభవాలను గుర్తుచేసుకున్నారు.

# బెంగళూరులో వందేమాతరం అవార్డు అందుకున్న చంద్రఆదిత్య

కావలి,

వందేమాతర గీతం150 సంవత్సరములు పూర్తయిన సందర్భంగా బెంగళూరులో జరిగిన వందేమాతరం వేడుకలు అవార్డు ప్రధాన కార్యక్రమంలో తెలుగు సినీ రంగానికి చెందిన విలక్షణ దర్శకుడు డాక్టర్ పి సి ఆదిత్యకు ప్రతిష్టాత్మక వందేమాతరం పురస్కారాన్ని అందజేశారు. నైన్ ఫిగర్ మీడియాఆధ్వర్యంలో జరిగిన అవార్డుల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కర్ణాటక లా కమిషన్ చైర్మన్ జస్టిస్ అశోక్ హాజరయ్యారు. ప్రత్యేక అతిధులుగా డాక్టర్ నే జ్యోతి నీరజ, సీఈవో పీపుల్ ట్రీ హాస్పిటల్, ప్రముఖ సిని నిర్మాత సంతోష్ కుమార్ ఆచార్య తదితరులు హాజరయ్యారు. ప్రతిష్టాత్మక అవార్డుల కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన ప్రతిభావంతులకు నిష్ణాతులకు వందేమాతరం అవార్డులను అందజేశారు.అందులో భాగంగా తెలుగు సినీ రంగానికి చెందిన నిత్య ప్రయోగశీలి విలక్షణ దర్శకుడు డాక్టర్ పిసి.ఆదిత్యను వందేమాతరం అవార్డుతో సత్కరించారు.ఈ సందర్భంగా నిర్వాహకులు నైన్ ఫిగర్ మీడియా చైర్మన్ కే సంపత్ కుమార్ మాట్లాడుతూ ఆదిత్య తన సుదీర్ఘ సినీ జీవితంలో ఎంతోమంది నూతన కళాకారులకు అవకాశాలు కల్పించడం అభినందనీయం,వారికి నేడు వందేమాతరం పురస్కారం అందుచేయటం మాకు సంతోషంగా ఉందన్నారు.నిర్వాహకులు డాక్టర్ అభినందన్ మాట్లాడుతూ ఆదిత్య వంటి నిష్ణాతులైన దర్శకుడిని వందేమాతరం అవార్డుతో సత్కరించడం గర్వంగా ఉందన్నారు.ముఖ్య అతిథి జస్టిస్ స్ అశోక్ బి మాట్లాడుతూ ఆదిత్య కేవలం తెలుగులోనే కాక కన్నడలో కూడా సందేశాత్మక చిత్రాలు రూపొందించాలని కోరారు. ప్రముఖ శని నిర్మాత సంతోష్ కుమార్ ఆచార్య ఆదిత్య అభినందిస్తూ ఆదిత్య దర్శకత్వంలో తెలుగు, కన్నడ భాషల్లో మంచి చిత్రాన్ని రూపొందిస్తారని హామీ ఇచ్చారు. ప్రతిష్టాత్మక వందేమాతరం అవార్డు అందుకున్న ఆదిత్య స్పందిస్తూ రిపబ్లిక్ డే సందర్భంగా ఎవరిని అందుకోవడం సంతోషంగానే గర్వంగానే ఉందని నూతన ప్రతిభను ప్రోత్సహించడంలో తనకు మరింత బాధ్యత కలిగిందని త్వరలోనే కన్నడ భాషలో కూడా సందేశాత్మక చిత్రం రూపొందిస్తానని హామీ ఇచ్చారు. వందేమాతరం అవార్డు గ్రహీత ఆదిత్యను అభిమానులు మిత్రులు అభినందించారు

# ఫిబ్రవరి 7, 8 న రాష్ట్రం గర్వించేలా కొండవీడు ఉత్సవాలు : ప్రత్తిపాటి

**- ఇకపై ఏటా జనవరి 18 నుంచి 23 వరకు చిలకలూరిపేటలో జాతీయస్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు.. ఫిబ్రవరి తొలి శని, ఆదివారాల్లో అంగరంగ వైభవంగా కొండవీడు ఉత్సవాలు : ప్రత్తిపాటి.**

**- 7వ తేదీ తొలిరోజు ఉత్సవాలకు ప్రత్యేక అతిథిగా పర్యాటక మంత్రి కందుల దుర్గేశ్ : ప్రత్తిపాటి.-ఫిబ్రవరి 10 నుంచి వేసవి ముగిసేవరకు కొండపై ప్రత్యేక టెంట్ లలో పర్యాటకుల రాత్రి బసకు ఏర్పాట్లు : ప్రత్తిపాటి.**

**- కొండవీడు వైభవం. చరిత్ర, గొప్పతనం తెలిపేలా ప్రత్యేక గీతావిష్కరణ.. 5 వ తేదీన ప్రత్యేక కర్టెన్ రైజర్ : ప్రత్తిపాటి.**

**-కోటకు వచ్చే మార్గంలో చౌడవరం వద్ద రూ.220 కోట్ల అంచనా వ్యయంతో గతంలో చంద్రబాబు హాయాంలో నిర్మించాలనుకున్న టన్నెల్ పనులు ఈ ఏడాది ప్రారంభమయ్యేలా చూస్తాం : ప్రత్తిపాటి.**

**- కొండవీడు ఉత్సవాల నిర్వహణలో భాగంగా జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, వివిధ శాఖల అధికారులతో కలిసి కోటను పరిశీలించి అక్కడే సమీక్ష నిర్వహించిన మాజీమంత్రి.**

**- ఏర్పాట్లు, కార్యక్రమాల నిర్వహణపై అధికారులకు దిశానిర్దేశం చేసిన జిల్లా కలెక్టర్ శ్రీమతి కృతికా శుక్లా**

**- 8వ తేదీన జబర్దస్త్ బృందంతో వినోద కార్యక్రమం.. గాయని గీతామాధురితో సంగీత విభావరి, విద్యార్థుల కోసం ప్రత్యేక కార్యక్రమాలు : కృతికా శుక్లా.**

చిలకలూరిపేట అక్షర విజేత

కొండవీడు ఉత్సవాలకు ఉన్న చారిత్రక ప్రాధాన్యత, విశిష్టత, వైభవాలను గత ప్రభుత్వం విస్మరించిందని, గతంలో చంద్రబాబునాయుడి ముఖ్యమంత్రిత్వంలో ఘనంగా ఉత్సవాలు జరిగాయని, మరలా ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో ఇకపై ప్రతి ఏటా ఉత్సవాల నిర్వహించబోతున్నామని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. కొండవీడు ఉత్సవాల నిర్వహణపై వివిధ శాఖల ఉన్నతాధికారులతో మాజీమంత్రి ప్రత్తిపాటి, పల్నాడు జిల్లా కలెక్టర్ శ్రీమతి కృతికా శుక్లా బుధవారం చారిత్రక ప్రదేశంలోనే సమీక్ష నిర్వహించారు. కొండవీడును సందర్శించిన మాజీమంత్రి, జిల్లా కలెక్టర్ ఉత్సవాల ఏర్పాట్లు, పర్యాటకులకు కల్పించాల్సిన సౌకర్యాలపై విస్తృతంగా చర్చించారు. అనంతరం ఇరువురూ విలేకరులతో మాట్లాడారు.

**తొలిరోజు ఉత్సవాల ప్రత్యేక అతిథి పర్యాటక మంత్రి కందుల దుర్గేశ్**

ఫిబ్రవరి 7,8 తేదీల్లో కొండవీడు హెరిటేజ్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నామని ప్రత్తిపాటి చెప్పారు. ఈ ఉత్సవాల తొలిరోజున ప్రత్యేక అతిథిగా రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేశ్ హాజరవుతారని చెప్పారు. అలానే రెండోరోజు మరో ఇద్దరు మంత్రులు వచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేశామని, వారి అంగీకారం కోసం ఎదురుచూస్తున్నామని చెప్పారు. కేంద్రమంత్రి పెమ్మసానితో సంప్రదిస్తున్నామని, ఆయన కూడా వచ్చేలా చూస్తామన్నారు.

ఫిబ్రవరి 10 నుంచి వేసవి ముగిసేవరకు కొండపై ప్రత్యేక టెంట్ లలో పర్యాటకుల రాత్రి బసకు ఏర్పాట్లు

కొండవీడు కోట కేంద్రంగా శ్రీకృష్ణదేవరాయలు, రెడ్డిరాజులు పాలన సాగించారని, ఆనాటి ఘన కీర్తికి అద్దం పట్టేలా, నాటి చరిత్ర..వైభవం నేటి తరాలకు తెలిసేలా ఒక ప్రత్యేక గీతాన్ని రూపొందిస్తున్నట్టు ప్రత్తిపాటి చెప్పారు. తొలిరోజున ఆ గీతాన్ని విడుదల చేస్తామన్నారు. కొండవీడు కోటలో చేపట్టాల్సిన నిర్మాణాలకు సంబంధించి పురావస్తుశాఖ అనుమతులు లభించినందున కోటపై ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయం, దర్గా, మసీదులకు మరమ్మతులు చేయించనున్నట్టు ప్రత్తిపాటి చెప్పారు. ఫిబ్రవరి 10 వ తేదీ నుంచి వేసవి ముగిసేవరకు రాత్రిళ్లు కూడా పర్యాటకులు కోటపై బసచేసేలా ప్రత్యేక టెంట్ లు ఏర్పాటు చేయబోతున్నామని, వారికి అవసరమైన వసతి, భోజన ఏర్పాట్లకోసం ప్రసిద్ధి చెందిన ఆహారతయారీ, సరఫరా కేంద్రాలను కూడా కోటపైనే ఏర్పాటుచేసేలా చర్యలు చేపట్టినట్టు ప్రత్తిపాటి పేర్కొన్నారు.

**కొండవీడు మార్గంలో రూ.220 కోట్ల అంచనా వ్యయంతో టన్నెల్ నిర్మాణం**

కొత్తపాలెంలోకి వెళ్లే పనిలేకుండా ఊరి బయట నుంచే కొండవీడుకోటకు చేరేలా మార్గాన్ని ఏర్పాటుచేశామని, అదే విధంగా చౌడవరం నుంచి కోటకు వచ్చే మార్గంలోని 5 కిలోమీటర్ల టన్నెల్ నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభమయ్యేలా చూస్తామన్నారు. ఈ టన్నెల్ రూ.220 కోట్ల అంచనావ్యయంతో నిర్మిస్తామని గతంలోనే చంద్రబాబు ప్రకటించారని, గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఆ ప్రక్రియ నిలిచిపోయిందన్నారు. టన్నెల్ పూర్తయితే, గుంటూరు నుంచి నేరుగా కోటకు వచ్చేవారికి దూరం తగ్గి, ప్రయాణం సౌకర్యవంతంగా ఉంటుందని ప్రత్తిపాటి తెలిపారు.టన్నెల్ నిర్మాణాన్ని 2026లో పూర్తయ్యేలా చూడాలని గతంలో ముఖ్యమంత్రిని కలిసినప్పుడు తెలియచేయడం జరిగిందని, సీఎం కూడా సానుకూలంగా స్పందించారని ప్రత్తిపాటి వివరించారు. కోటను చారిత్రక, పర్యాటక కేంద్రంగానే కాకుండా, ప్రజల శుభకార్యాల నిర్వహణకు ఒక ప్రత్యేక కేంద్రంగా తీర్చిదిద్దే ఆలోచన చేస్తున్నట్టు చెప్పారు. సీఆర్డీఏ పరిధిలో ఉన్న ప్రఖ్యాత చారిత్రక, పర్యాటకప్రాంతమైన కొండవీడుకోటకు పూర్వవైభవం తీసుకొచ్చేందుకు, జాతీయ పర్యాటక, సాంస్కృతిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కూటమిప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సహాయసహకారాలతో తనవంతు జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారుల సమన్వయంతో చేయాల్సిన కృషి చేస్తున్నట్టు ప్రత్తిపాటి పేర్కొన్నారు.

ఇకపై ప్రతి ఏటా జనవరి 18 నుంచి 23 వరకు జాతీయస్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు.. ఫిబ్రవరి తొలి శని, ఆదివారాల్లో కొండవీడు ఉత్సవాలు

ఇకపై ప్రతి ఏటా ఫిబ్రవరి తొలి శని, ఆదివారాలు కొండవీడు కోట ఉత్సవాలు నిర్వహిద్దామన్న జిల్లా కలెక్టర్ సూచనకు అంగీకరించినట్టు ప్రత్తిపాటి చెప్పారు. ఇకపై ప్రతిఏటా జనవరి 18 (ఎన్టీఆర్ వర్ధంతి) నుంచి జనవరి 23 (లోకేశ్ జన్మదినం) వరకు చిలకలూరిపేటలో జాతీయస్థాయి ఎడ్లపందేలు క్రమం తప్పకుండా నిర్వహిస్తామని, అలానే ప్రతి ఏటా ఫిబ్రవరి తొలి శని, ఆదివారాలు రెండురోజులు కొండవీడు చారిత్రక ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. చారిత్రక ఉత్సవాలకు విద్యార్థినీ, విద్యార్థులు, యువత ఎక్కువగా వచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఉత్సవాల నిర్వహణలో భాగంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నామని, లేజర్ షో, రోప్ రైడింగ్ హెలికాప్టర్ రైడ్, శాండ్ ఆర్ట్ వంటి ప్రజాకర్షక కార్యక్రమాలు ఉంటాయని





ప్రత్తిపాటి చెప్పారు. అలానే కోటపై ప్రత్యేక జంతుప్రదర్శనశాల, సఫారీ రైడింగ్ ఏర్పాటు ఆలోచన చేస్తున్నామన్నారు.

**5వ తేదీన ఉత్సవాల ప్రాశస్త్యం తెలిసేలా ప్రత్యేక కర్టెన్ రైజర్**

కొండవీడు ఉత్సవాల ప్రచార కార్యక్రమానికి సంబంధించిన కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని ఫిబ్రవరి 5న నిర్వహించనున్నామని ప్రత్తిపాటి చెప్పారు. కొండవీడు కోటకు ఎంతో ఘనమైన చరిత్ర ఉందని, కొండపై మూడుచెరువులు, దేవాలయాలు, మసీదు వంటి విశిష్ట ప్రదేశాలు ఉండటం దేశంలో ఎక్కడా లేదని ప్రత్తిపాటి చెప్పారు. ప్రభుత్వ సహకారంతో ప్రతి ఏటా ఇకపై ఏటికేడు ఉత్సవాలు ఘనంగా నిర్వహించేలా శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తామని ప్రత్తిపాటి చెప్పారు. టీడీపీ హాయాంలో కోటపై జరిగిన ఉత్సవాలు తప్ప, గత ప్రభుత్వంలో అక్కడ ఎలాంటి కార్యక్రమాలు జరగలేదన్నారు. గతంలో హిమాంశు శుక్లా ఉమ్మడి గుంటూరు జిల్లా కలెక్టర్ గా ఉన్నప్పుడు ఉత్సవాలు జరిగాయని, నేడు పల్నాడు జిల్లా కలెక్టర్ గా కృతికా శుక్లా ఆధ్వర్యంలో మరలా జరగడం విశేషమని, ఇద్దరూ సమర్థవంతమైన అధికారులని ప్రత్తిపాటి తెలిపారు. కొండవీడు ఉత్సవాల ప్రాధాన్యత, వైభవాన్ని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విభాగాలు, కూటమి పార్టీల సోషల్ మీడియా విస్తృతంగా ప్రచారం చేయాలని ప్రత్తిపాటి విజ్ఞప్తి చేశారు.

**యువత, విద్యార్థులు, మహిళలు మెచ్చేలా కొండవీడు ఉత్సవాల నిర్వహణ : జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా**

" మన జిల్లాలో కొండవీడు ఉత్సవాలు ఇప్పుడు మూడోసారి జరుగుతున్నాయి. ఉత్సవాల ఏర్పాట్లపై నేడు పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించడం జరిగింది. పర్యాటకులకు కల్పించాల్సిన సౌకర్యాలు. సాంస్కృతిక కార్యక్రమాలపై చర్చించాము. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఫిబ్రవరి 7వ తేదీన ఉదయం యోగాకార్యక్రమంతో ఉత్సవాలు ప్రారంభించనున్నాం. 7, 8 రెండు రోజులు ఉదయం 10 నుంచి సాయంత్రం 6 వరకు వివిధ రకాల కార్యక్రమాలు ఉంటాయి. ఉత్సవాల్లో భాగంగా హెలికాప్టర్ రైడింగ్, బోటింగ్, హార్స్ రైడింగ్, రాక్ క్లైంబింగ్, లేజర్ షో, ఫ్లవర్ షో, శాండ్ ఆర్ట్ వంటివి ఏర్పాటు చేస్తున్నాం. కొండ దిగువన పార్కింగ్ ఏర్పాటుచేశాం. పర్యాటకులకోసం ఉచిత బస్సులు ఏర్పాటు చేయనున్నాం. పర్యాటకులు తప్పనిసరిగా బస్సుల్లోనే రావాలి. విద్యార్థినీ విద్యార్థుల్లోని ప్రతిభను ప్రోత్సహించేలా నృత్యం, గానం, నటన సహా వారికోసమే కొన్ని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించబోతున్నాం. చివరిరోజున జబర్దస్త్ బృందంతో వినోద కార్యక్రమం.. గాయని గీతామాధురితో సంగీత విభావరి, ఒడిశా, ఉత్తరాంధ్ర కళాకారులతో ప్రత్యేక నృత్య ప్రదర్శనలు నిర్వహించనున్నాం." అని జిల్లా కలెక్టర్ శ్రీమతి కృతికా శుక్లా తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎఎస్పీ జీ.వి.సంతోష్, డిఎఫ్వో కృష్ణప్రియ, ఆర్డీవో మధులత, వివిధ శాఖల అధికారులు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, మండల అధ్యక్షులు కామినేని సాయిబాబు, జిల్లా రైతు అధ్యక్షులు మద్దూరి వీరారెడ్డి, పోపూరి వెంకయ్య, సొసైటీ చైర్మన్ సుబ్బారావు, మద్దూరి శ్రీనివాస రెడ్డి, బీజేపీ నాయకులు మల్లెల శివనాగేశ్వరరావు, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, కూటమి నాయకులు, గ్రామ నాయకులు, ఎమ్మార్వో, ఎంపీడీవోలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

